## క్లుప్తంగా

### అప్పన్న సేవలో గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్‌కి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో ఆనంద్‌కుమార్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం స్వామి ప్రసాదం, జ్ఞాపికలను ఏఈవో ఆనంద్‌కుమార్ అందించారు. అలాగే విప్ గణబాబు దంపతులు, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జట్టి, ఎంజీఎన్ఆర్‌జీఈఏ డిప్యూటీ సెక్రటరీ ఆశిష్‌గుప్తా(న్యూఢిల్లీ), ఐఎఫ్ఎస్ డైరెక్టర్ షణ్ముఖ్‌కుమార్ తదితరులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాన్ని దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, ప్రోటోకాల్ ఏఈవో రాంబాబు వారికి అందజేశారు.



వేదపండితుల ఆశీర్వచనం స్వీకరిస్తున్న డీఐజీ గోపీనాథ్‌జట్టి దంపతుల


### బీజేపీ విజయోత్సవ ర్యాలీ

పెందుర్తి: మహారాష్ట్ర ఎన్నికల్లో మహాయుతి కూటమి విజయం సాధించడంతో బీజేపీ ఆధ్వర్యంలో శనివారం చినముషిడివాడలో విజయోత్సవ ర్యాలీ చేశారు. 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు చిట్టిబోయిన శంకర్రావు, కోన మంగయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### శివారు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

పరవాడ: దేశపాత్రునిపాలెం శివారు గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని జీవీఎంసీ 79 వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు అన్నారు. దేశపాత్రునిపాలెం శివారు జాజులవానిపాలెం, శ్రీనివాసనగర్, ఎస్సీ కాలనీ, సాయినగర్, అశోక్‌నగర్ కాలనీలను శనివారం ఆయన సందర్శించారు. కాలనీల్లోని మురుగు కాలువలు, అధ్వాన రహదారులను పరిశీలించి, వాటి నిర్మాణాలకు అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. పబ్లిక్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ సురేష్, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

### ముదపాక భూముల కేటాయింపుపై విచారణ



రికార్డులు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ ప్రాంతీయ అధికారి శ్రీనివాసరావు

పెందుర్తి: పెందుర్తి మండలం ముదపాక పంచాయతీలో గత ప్రభుత్వాల హయాంలో జరిగిన డీ ఫాం భూముల కేటాయింపులపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం విచారణ చేపట్టారు. విజిలెన్స్ ప్రాంతీయ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలోని అధికారుల బృందం ముదపాకలోని భూములను పరిశీలించింది. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసింది. తహసీల్దార్ ఆనంద్‌కుమార్ నుంచి పలు అంశాలు సేకరించింది.

# వసతుల్లేక అవస్థలు

- సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమస్యల తిష్ట
- చాలీచాలని గదులతో ఒంటి పూట తరగతుల నిర్వహణ



సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమస్యలు తిష్టవేశాయి. కళాశాల ఏర్పాటు చేసి నేటికి సుమారు 16 ఏళ్లు కావస్తున్న.. వసతులు మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నాయి. దీంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

**దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సబ్బవరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేయగా.. సొంత భవనాలు లేకపోవడంతో 13 ఏళ్ల పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులు** నిర్వహించారు. ఈ క్రమంలో కళాశాలకు ప్రభుత్వం కేటాయించిన ఐదెకరాల స్థలంలో భవన నిర్మాణాలు పూర్తి కాగా.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఈ భవనాలను ప్రారంభించారు. కళాశాల నూతన ప్రాంగణంలోకి మూడేళ్ల కిందట అడుగు పెట్టగా.. మౌలిక సదుపాయాల సమస్య మాత్రం వేధిస్తోంది.

కళాశాలకు తరగతి గదులు మినహా.. మరేవిధమైన వసతులు లేవు. అదనపు తరగతి గదులు, క్రీడా మైదానం, ప్రహరీ, రహదారులు ఏర్పాటు **చేయాల్సి ఉంది. ప్రస్తుతం కళాశాలలో 520 మంది విద్యార్థులు చదువుతున్నారు.** విద్యార్థులకు **అవసరమైన తరగతి గదులు సగం** కూడా లేకపోవడంతో.. **షిఫ్టుల విధానంలో ఒంటి** పూట తరగతులు నిర్వహిస్తున్నారు. బీఎస్సీ బోటనీ, బీఎస్సీ కంప్యూటర్స్, బీఎస్సీ ఫిజిక్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఏ హిస్టరీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్ తదితర కోర్సులు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం 24 వరకు తరగతి గదుల అవసరం ఉంది. అయితే కళాశాలలోని 5 తరగతి గదులను 10 తరగతి గదులుగా విభజించి బోధన సాగిస్తున్నారు. అలాగే కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్, బాలికల వెయిటింగ్ హాల్, గ్రంథాలయం, అదనంగా మరో స్టాఫ్ రూమ్ అవసరం ఉంది. కళాశాలలో అన్నీ కలిపి 15 వరకు మరుగుదొడ్లు ఉండగా.. అదనంగా మరో 10 మరుగుదొడ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కళాశాలకు వచ్చేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడం ఇంకో ప్రధాన సమస్య. గతంలో విద్యార్థులు నేలపైనే కూర్చొని విద్యనభ్యసించేవారు. కళాశాల అభ్యర్థన మేరకు ఎన్‌టీపీసీ.. సీఎస్సార్ నిధులతో సుమారు రూ.9 లక్షల విలువైన బెంచీలను సమకూర్చింది.



విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్న అధ్యాపకుడు



ఎన్‌టీపీసీ సమకూర్చిన బెంచీలు

### అదనపు భవనాలు సమకూర్చాలి



సరిపడినన్ని తరగతి గదులు లేకపోవడంతో ఒంటి పూట తరగతులు నిర్వహిస్తున్నారు. బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కాలేజీ ఉంటుంది. బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, సీబీజెడ్ గ్రూపులకు ఉదయం పూట తరగతులు ఉంటాయి. మిగిలిన గ్రూపులకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు బోధిస్తున్నారు.

– నంబారు దినేష్, బీఏ ద్వితీయ సంవత్సరం

### వసతుల లేమితో ఇబ్బందులు



మా కళాశాలలో గదులు చాలకపోవడంతో మధ్యాహ్నం తరగతులకు హాజరవుతున్నాం. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాలేజీ ఉంటుంది. కళాశాల అనంతరం బస్సులు లేకపోవడంతో దూరం ప్రాంతం వెళ్లాల్సిన నాలాంటి వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సరిపడినన్ని మరుగుదొడ్లు లేకపోవడం కూడా ఇబ్బందిగా ఉంది.

– ఎస్.భవాని, ద్వితీయ సంవత్సరం, బీఎస్సీ బోటనీ

### ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



కళాశాలలో చేరేందుకు విద్యార్థులు ఎంతో ఆసక్తి చూపిస్తున్నారు. అయితే వారికి అవసరమైన వసతులు లేకపోవడం వల్ల కొంత ఇబ్బంది ఉంది. ఈ విద్యా సంవత్సరంలో కళాశాలలో 290 సీట్లకు గానూ 230 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాం. కళాశాలకు అవసరమైన అన్ని రకాల వసతులపై ప్రతిపాదనలు సిద్ధం చేసి.. స్థానిక ఎమ్మెల్యేతో పాటు ఉన్నతాధికారులకు అందజేశాం. దీనికి స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి.. అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

– డాక్టర్ బి.సీతాలక్ష్మి, ప్రిన్సిపాల్

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



స్వచ్ఛతా హీ సేవాలో పాల్గొన్న ఎంపీడీవో పద్మజ

సబ్బవరం: గ్రామాలను ఆహ్లాదంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో పి.పద్మజ పిలుపునిచ్చారు. గుల్లేపల్లిలో శనివారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సిబ్బందితో కలిసి పరిసరాలను శుభ్రపరిచారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతీ శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమన్నారు. సర్పంచ్ బండారు మంగ, గ్రామ పెద్దలు బోకం రాముసాయుడు, బండారు శ్రీనివాసరావు, సచివాలయం, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## కోడిపందాల స్థావరంపై దాడులు

- ఐదుగురి అరెస్ట్

సబ్బవరం: గొల్లలపాలెం పరిధి అప్పయ్యపాలెం శివారులో నిర్వహిస్తున్న కోడి పందాల స్థావరంపై సబ్బవరం పోలీసులు దాడులు చేశారు. పందాలు ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి.. వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. అప్పయ్యపాలెం శివారులోని మామిడి తోటలో శనివారం కోడి పందాలు ఆడుతున్నట్లు అందిన సమాచారంతో సీఐ పిన్నింటి రమణ సిబ్బందితో దాడులు చేశారు. పందాలు ఆడుతున్న గాజువాకకు చెందిన కొండా పెంటయ్య, అగనంపూడికి చెందిన అట్టా చంద్రయ్య, వెదుళ్లనరవకు చెందిన మాటూరి సాయి కుమార్, కూర్మన్నపాలేనికి చెందిన కె.సూర్యప్రకాష్, పెదగంట్యాడకు చెందిన కె.గిరిబాబులను అరెస్ట్ చేశారు. మరికొందరు పరారయ్యారు.

## క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతం

- త్వరలో పార్టీ, అనుబంధ కమిటీల నియామకం
- కూటమి ప్రభుత్వం ప్రజలను వంచించిన తీరుపై పోరాటం
- పార్టీ ముఖ్య నేతల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్




పార్టీ ముఖ్య నేతలతో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: గ్రామ, వార్డు స్థాయిలో వైఎస్సార్ సీపీకి పూర్వవైభవం తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు.. మోసం చేసిన తీరుపై ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. రాంపురంలోని క్యాంప్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య నేతలతో అదీప్‌రాజ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్ ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలో వచ్చారన్నారు. కానీ అధికారం చేపట్టి ఆరు నెలలు కావస్తున్నా హామీలను అమలు చేయకుండా ప్రజలను వంచించారని విమర్శించారు. పార్టీ పరంగా ప్రజలకు అండగా నిలుస్తూ.. ప్రభుత్వం ప్రజలను మోసం చేసిన తీరును ఎండగడతామని చెప్పారు. కూటమి ప్రభుత్వం మోసం చేసిన తీరును గ్రామస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాలని దిశానిర్దేశం చేశారు. పార్టీ అనుబంధ కమిటీల నియామకానికి సన్నద్ధమవుతున్నట్లు వెల్లడించారు. త్వరలోనే పూర్తిస్థాయి కమిటీల ఏర్పాటు ఉంటుందన్నారు. దీనిపై నేతల అభిప్రాయాలు తీసుకున్నారు. సమావేశంలో సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, బీసీ సెల్ అధ్యక్షుడు కొటాన రాము, పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పి.ఎస్ రాజు, పార్టీ సబ్బవరం, పరవాడ మండల అధ్యక్షులు కర్రి బాబు, కోన రామారావు, వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, చిరికి దేముడు, అంతకాపల్లి సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


## 26న అనకాపల్లిలో ఆందోళన



ఫార్మాసిటీలో ప్రచారం చేస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: రైతు, కార్మిక సమస్యలపై ఈ నెల 26న అనకాపల్లిలో నిర్వహించనున్న ఆందోళనను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు కోరారు. ఫార్మాసిటీలో సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు, కార్మిక సమస్యలు పట్టించుకోలేదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. కార్పొరేటర్లకు లొంగి ప్రభుత్వం పనిచేస్తోందని.. అదే దారిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనంగా రూ.26 వేలు అమలు చేయాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, విశాఖ డెయిరీ పాల ధరను వెంటనే పెంచి రైతులకు బోనస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## వెంకన్నకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, దీపోత్సవం, ధూప సేవ, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. అన్న ప్రసాదం, మజ్జిగ వితరణ చేపట్టారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

## సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం




మాట్లాడుతున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: ప్రస్తుత సాంకేతికతను వినియోగించుకుని సైబర్ నేరాలకు పాల్పడుతున్న వ్యక్తుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పెందుర్తి సీఐ కె.వి.సతీష్‌కుమార్ సూచించారు. సైబర్ నేరాలపై నరవలోని విశాఖ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన అవగాహన సదస్సులో సీఐ మాట్లాడారు. విద్యార్థులంతా సైబర్ నేరాల పట్ల కుటుంబ సభ్యులకు అవగాహన కలిగించాలన్నారు. విద్యార్థి దశలో చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి వినియోగం, రవాణా జీవితాలను నాశనం చేస్తుందన్నారు. బెట్టింగ్ యాప్‌లకు బానిసలు కావద్దన్నారు. నేరాలకు పాల్పడిన వారు జైలు పాలవుతారని.. వారి కుటుంబాలు రోడ్డున పడతాయని హెచ్చరించారు. సమాజంలో గుర్తింపు కావాలంటే చక్కటి నడవడిక అవసరమని చెప్పారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే అనుకున్న లక్ష్యాలను అలవోకగా చేరుకోవచ్చని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి ప్రదీప్‌వర్మ, కళాశాల డీన్ డాక్టర్ డి.శాంతారావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సత్యసాయి అందించిన సేవలు అజరామరం



సుజాతనగర్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల



చినముషిడివాడ సత్యసాయి మందిరం వద్ద అన్నదానం ప్రారంభిస్తున్న శానాపతి శంకరరావు

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో శనివారం సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సుజాతనగర్‌లో ఆనందసాయి ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి 108 రకాల నైవేద్యాలు సమర్పించారు. నగర సంకీర్తన చేపట్టారు. అష్టలక్ష్మి పూజలు చేశారు. గర్భిణులకు నిత్యావసర వస్తువులు, పలువురు నిరుపేదలకు కుట్టుమిషన్లు, 108 మందికి దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ సర్వమానవాళికి సత్యసాయిబాబా అందించిన సేవలు అజరామరమని అన్నారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, మందిరం ప్రతినిధులు బుజ్జిబాబు, జ్యోతి, గోపి, సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

- చినముషిడివాడలోని సత్యసాయి మందిరంలో కార్పొరేటర్ శానాపతి వసంత, నాయకుడు శానాపతి శంకరరావు చేతుల మీదుగా 70 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ముందుగా బాబాకు ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం జరిగిన అన్న సమారాధనలో దాదాపు 5 వేల మంది ప్రసాదం స్వీకరించారు. మందిరం ప్రతినిధులు ఆర్.రమేష్, భాస్కర్, శ్రీనివాస్, చలపతిరావు, సత్యవాణి, గౌరునాయుడు, మురిపిండి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్

సబ్బవరం: ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ కోరారు. మండలంలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను శనివారం సందర్శించిన ఆయన.. పీఆర్‌టీయూ సభ్యత్వాలు సేకరించారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ జెడ్పీ పీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐ రుణాలు, ఆర్జిత సెలవులు, డీఏ ఎరియర్స్ బకాయిలు చెల్లించాలన్నారు. పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించి మెరుగైన మధ్యంతర భృతిని ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. మైదాన ప్రాంతం నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులను తిరిగి మైదాన ప్రాంతాలకు తీసుకురావాలన్నారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అప్పలనాయుడు, భాస్కర్, సత్యంనాయుడు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం కేంద్ర బృందం పర్యటన



ఎస్ఆర్‌పురంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఉపాధి హామీ పథకం కేంద్ర బృందం

పెందుర్తి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కేంద్ర బృందం పెందుర్తి మండలం ఎస్ఆర్ పురం, వాలిమెరక పంచాయతీల్లో శనివారం పర్యటించింది. కేంద్ర ప్రోగ్రాం అధికారి కిరణ్ చంద్ పాండే ఆధ్వర్యంలో ఆయా పంచాయతీల్లో పర్యటించి ఉపాధి హామీ పథకం ద్వారా 2015 నుంచి జరిగిన పనులపై ఆరా తీశారు. ప్రస్తుతం ఎంజీఎన్ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా జరుగుతున్న పనులను పరిశీలించారు. గ్రామ సచివాలయాలను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఈజీఎస్ డైరెక్టర్ వై.వి.కె.షణ్ముక్‌కుమార్, జిల్లా, మండల ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ముమ్మరంగా వరి కోతలు



నియోజకవర్గంలో వరి చేను కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. వరి చేను పక్వానికి రావడంతో రైతాంగం పూర్తిగా పొలం బాట పట్టింది. పెందుర్తి, సబ్బవరం, పరవాడ ప్రాంతాల్లో కోతల్లో రైతులు, కూలీలు నిమగ్నమయ్యారు. అయితే రానున్న రెండు మూడు రోజుల్లో తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సమాచారంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

– పెందుర్తి

## వేడుకగా మహా సన్నిధానం



మహాసన్నిధానం పూజలకు వివిధ ప్రాంతాల నుంచి హాజరైన అయ్యప్ప భక్తులు

పరవాడ: ఫార్మాసిటీ కాలనీకి చెందిన మేడిశెట్టి అప్పారావు, బాలాజీనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన మహా సన్నిధానం మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అయ్యప్ప నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. ఈ కార్యక్రమానికి మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హాజరై అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగేశ్వర శర్మ, సుమారు 3 వేల మంది అయ్యప్ప మాలధారులు స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. రాజేష్ గురుస్వామి ఆలపించిన అయ్యప్ప స్వామి గీతాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం స్వామి ప్రసాదాలు స్వీకరించారు.

## ప్రణాళికాబద్ధంగా బాలోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

పెందుర్తి: వచ్చే నెల 14, 15 తేదీల్లో జరిగే పెందుర్తి బాలోత్సవం ప్రణాళికాబద్ధంగా నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ కోరారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం జరిగిన సమావేశంలో బాలోత్సవం నిర్వహణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బాలోత్సవంలో పెందుర్తి ప్రాంతంలోని ఔత్సాహిక పిల్లలందరూ పాల్గొనేలా కమిటీ సభ్యులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖ బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జి.ఎస్.రాజేశ్వరరావు, కమిటీ ప్రతినిధులు పి.వి.రమణ,ఎ.చంద్రశేఖర్, కె.విశ్వనాథ్, రాయల్ ఈవీ పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థులకు నైపుణ్య శిక్షణ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఉపాధ్యాయులు

సబ్బవరం: అటల్ మారథాన్‌లో భాగంగా సబ్బవరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు అనంతపురంలోని శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక శిక్షణ అందించారు. అటల్ మారథాన్‌కు దేశవ్యాప్తంగా 20 వేల ప్రాజెక్టులు రాగా.. అందులో 500 ప్రాజెక్టులను ఎంపిక చేశారు. తర్వాత వర్చువల్ విధానంలో టాప్ 150 ప్రాజెక్టులు ఎంపిక కాగా.. అందులో సబ్బవరం గురుకులానికి చెందిన 9వ తరగతి విద్యార్థులు జె.సందీప్, జి.గుణశేఖర్, ఎం.అశోక్ రూపొందించిన ప్రాజెక్ట్ కూడా ఉంది. ఈ నేపథ్యంలో శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. డిజైన్ థింకింగ్, మార్కెటింగ్, ఐడీఆర్ స్కిల్స్, ప్రొడక్ట్ డిజైన్ స్కిల్స్ వంటి అంశాలపై శిక్షణ అందించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వారికి గైడ్‌గా వ్యవహరించిన టి.రాంబాబును గురుకులాల సమన్వయాధికారి ఎస్.రూపావతి, ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ సత్యారావు తదితరులు అభినందించారు.